వైఎస్సార్ సీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా లవకుమార్



వేమూరు: బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కోగంటి లవకుమార్‌ని నియామకం చేయడం జరిగిందని జిల్లా పార్టీ అధ్యక్షుడు మేరుగ నాగార్జున తెలిపారు. నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు సిఫార్సు మేరకు కోగంటి లవకుమార్‌కు పార్టీ పదవి అప్పగించినట్లు తెలిపారు. లవకుమార్ నియామకం పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం అభినందనలు తెలిపారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆనందబాబు



చుండూరు(వేమూరు): ప్రభుత్వం అర్హత ఉన్నత ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. చుండూరు మండలంలోని మండూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంగళవారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలో అన్ని హామీలు అమలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ



నిజాంపట్నం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మొగదారమ్మ తల్లి ఆటో డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిజాంపట్నంలో ఆటోడ్రైవర్‌లకు మంగళవారం నూతన యూనిఫాంలు, స్వీట్లును పంపిణీ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్‌లు ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యాలకు చేర్చాలని సూచించారు. లైసెన్స్‌లు, గుర్తింపు కార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోపిదేవి హరనాధ్‌బాబు, ప్రసాదం వాసుదేవ, మోగదారమ్మ తల్లి ఆటోడ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు పి.సురేష్, మరక శ్రీను, భూశంకర్, బాపట్ల జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్.ప్రహ్లాదుడు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పునాదికే పరిమితం

ఏడేళ్లుగా నిలిచిపోయిన పంచాయతీ భవన నిర్మాణాలు



చినపులివర్రులో పునాది దశలో నిలిచిన పంచాయతీ భవనం



కిష్కిందపాలెంలో పిల్లర్లతో ఆగిపోయిన నిర్మాణం

కొల్లూరు: పంచాయతీ భవనాల నిర్మాణాలు పునాదుల దశలోనే కునారిల్లుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాం 2017లో చేపట్టిన భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు బిల్లుల మంజూరులో జాప్యం కారణంగం అర్ధంతరంగా నిలిపివేశారు. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ పనులను పూర్తి చేసే బాధ్యత చేపట్టకపోవడంతో రెండు పంచాయతీలకు పంచాయతీ కార్యాలయాలు కరవయ్యాయి. సుమారు ఏడేళ్లుగా పంచాయతీ కార్యాలయాలు అందుబాటులో లేకపోవడంతో మండలంలోని చినపులివర్రు, కిష్కిందపాలెం గ్రామాల్లోని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కిష్కిందపాలెం పంచాయతీ కార్యకలాపాలను ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహిస్తున్నారు. చినపులివర్రులో అద్దె గృహంలో పంచాయతీ కార్యకలాపాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పట్లో పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులున్నా.. ప్రభుత్వం బిల్లులు మంజూరులో జాప్యం చేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. గత టీడీపీ ప్రభుత్వంలో కొల్లూరు మండలంలో శిథిలావస్థలో ఉన్న పలు పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. రూ.15 లక్షలతో పంచాయతీ కార్యాలయ భవనాలు నిర్మించాల్సి ఉంది. అయితే అప్పట్లో నత్త నడకన సాగించిన పనుల కారణంగా గాజుల్లంక, ఈపూరులంక, సుగ్గునలంక పంచాయతీ కార్యాలయాల నిర్మాణాలు మాత్రమే జరిగాయి. అయితే వీటిలో సుగ్గునలంక పంచాయతీ కార్యాలయం పనులు 70 శాతం జరిగి నిలిచిపోయాయి. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సమయంలో మిగిలిన పనులను పూర్తి చేసి పంచాయతీ కార్యాలయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది.

పునాది దశ దాటని భవనాలు

మండలంలో కొల్లూరు, తోకలవారిపాలెం, కిష్కిందపాలెం, గాజుల్లంక, సుగ్గునలంక, చినపులివర్రు, ఈపూరులంక గ్రామాల పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఒక్కో భవన నిర్మాణానికి ఉపాధిహామీ పథకం కింద రూ. 13.50 లక్షలు, పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలతో నిర్మించడానికి అనుమతులు వచ్చాయి. అయితే ఏడేళ్ల అవుతున్నా కిష్కిందపాలెం, చినపులివర్రు పంచాయతీ కార్యాలయాల నిర్మాణ పనులు పునాది దశలోనే మగ్గుతున్నాయి. భవనాలను నిర్మించి, వినియోగంలోకి తీసుకుని రావాలని ప్రజలు కోరుతున్నారు.



సెంట్రల్ లైటింగ్‌కు తోడై.. కాంతులీనుతున్న విద్యుత్ అలంకరణలు..



రంగు రంగుల విద్యుద్దీపాల వెలుగుల్లో పట్టణంలోని సీబీజెడ్ చర్చి

భావపురి నూతన వెలుగులు సంతరించుకుంది. న్యూ ఇయర్ వేడుకలతో బాపట్ల పట్టణం సరికొత్త శోభను అద్దుకుంది. చర్చిలు, దేవాలయాలు, ప్రధాన వీధులు విద్యుత్ కాంతుల్లో వెలిగిపోయాయి. పట్టణ ప్రజలు 2024 గుడ్ బై చెబుతూ.. 2025కి ఘన స్వాగతం పలికారు.

– బాపట్ల టౌన్

పారిశుద్ధ్యం మెరుగుపరచాలి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టా మంగ



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె రూరల్: పారిశుద్ధ్య మెరుగులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. మంగళవారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. తడి-పొడి చెత్తను వేరు చేసి, గృహ యజమానులు పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. వేసవికి తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2024లో పట్టణాభివృద్ధికి రూ.12 కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధి ప్రణాళికలు చేయగా ఇప్పటికే రూ.6కోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. అనంతరం ఏజెండాలోని 26 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇటీవల మృతి చెందిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు కౌన్సిల్ రెండు నిమిషాలు మౌనం పాటించి, సంతాపం వ్యక్తం చేసింది. మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

వేమూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యా వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం నిర్వహించినట్లు ఎంఈఓ ఎంఈఓ ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉత్తమ ప్రదర్శనలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వ్యక్తిగతం విభాగం నుంచి చావలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వల్లభ దేవీశ్రీ , సామూహిక విభాగం పెరవలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కె.విజయలక్ష్మి, కె.జాహ్నవి ఎంపికయ్యారు. ఉపాధ్యాయులు విభాగం నుంచి చావలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కె.గోపాలకృష్ణారావు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

నూతన సంవత్సర సందడి



స్వీట్ షాపులో కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



వేడుకలకు సిద్ధం చేసిన స్వీట్లు

రేపల్లె రూరల్: పట్టణంలో 2025 నూతన సంవత్సరాన్ని జరుపుకునేందుకు ప్రజలు, యువత ఉత్సాహం చూపింది. నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు, వేడుకలను ఉత్సాహభరితం జరుపుకునేందుకు అధిక సంఖ్యలో ప్రజలు జరుపుకునేందుకు ఆసక్తి కనపరిచారు. దీంతో బేకరీలు, మిఠాయి దుకాణాలు కిటకిటలాడాయి. పట్టణంలోని పలు హోటళ్లలో ప్రజలు అధిక సంఖ్యలో ఉండటంతో సందడి వాతావరణం నెలకొంది.

న్యూ ఇయర్‌కు స్వాగతం

భట్టిప్రోలు: న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2024కు వీడ్కోలు పలికి 2025కు వినూత్నంగా స్వాగతం పలికారు. ఈ క్రమంలో బేకరీలు, స్వీట్ షాపులు కిటకిటలాడాయి. పండ్లు, వివిధ రకాల రంగులు, పుష్పగుచ్ఛాలకు డిమాండ్ పెరిగింది. ఆయా పార్టీల కార్యకర్తలు తమ అభిమాన నాయకులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వస్త్ర దుకాణాల యజమానులు వినియోగదారులను ఆకర్షించేందుకు ఆఫర్లు ప్రకటించారు.

గురుకుల పాఠశాలలో కలెక్టర్ నూతన సంవత్సర వేడుకలు



విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి దంపతులు



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వెంకట మురళి



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న కలెక్టర్ దంపతులు

బాపట్ల: విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో నూతన సంవత్సరం వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ దంపతులు విద్యార్థులతో కలిసి నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు విద్యార్థులతో కలిసి జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్య మనసు, సమాజంలోని చీకటిని పారద్రోలి.. కుటుంబాలను అభివృద్ధి వైపు నడిపిస్తుందని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తాను ఒక వంద కుటుంబాలున్న చిన్న గ్రామంలో పెరిగానని ఆయన గుర్తుచేసుకున్నారు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాల, కాలేజీల్లో చదువుకున్నానని తెలిపారు. తన మొదటి ఉద్యోగం సబ్ ఇన్‌స్పెక్టర్ అని, విధుల్లో రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నానని చెప్పారు. అనంతరం 2009లో ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ కలెక్టర్‌గా ఫస్ట్ ర్యాంక్ సాధించానన్నారు. విద్యార్థినులకు రక్షణ కల్పించడానికి 88 సంక్షేమ హాస్టళ్లలో 565 నిఘా కెమెరాలను ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ సతీమణి నాగలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి కలెక్టర్ దంపతులు భోజనం చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమా, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కె.సుభాషిణి, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, పాఠశాల ప్రిన్సిపల్ భవానీ దేవి, తహసీల్దార్ షాలీమా పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాస్

రేపల్లె రూరల్: ఉపాధ్యాయులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాకినాడలో జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు జరిగే ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) సర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ యూటీఎఫ్ సభ్యులు నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ మంగళవారం రాత్రి రేపల్లె పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పీఆర్సీ అందించాలన్నారు. కేవలం ఉపాధ్యాయుల సమస్యలపైనే కాకుండా యూటీఎఫ్ సామాజిక స్పృహతో కోవిడ్ కాలంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.వినయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, కార్యదర్శి ఎంవి సుబ్రహ్మణ్యం, నాయకులు కె.సాయి ప్రసాద్, కె.శివశంకర్, వాకా సుబ్బారావు, గలభ శ్రీనివాసరావు, గణేష్, రవీంద్ర, రాజభూషణం, రమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యూరియా కొరతపై తనిఖీ

సాక్షి ఎఫెక్ట్



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

వేమూరు: మండలంలో యూరియా కొరతపై రేపల్లె డివిజన్ వ్యవసాయాధికారి ఆర్.విజయబాబు, ఏఓ చందోలు సునీత మంగళవారం స్పందించారు. సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఎరువుల కొరతపై సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో సంఘంలో ఎరువుల రికార్డులను అధికారులు తనిఖీ చేశారు. మండలంలోని రబీ సీజన్‌లో జొన్న, మొక్కజొన్న మినుము, పెసర పంటలు 13,000 ఎకరాల్లో సాగు చేశారని, అవసరమైన ఎరువులు ప్రయివేటు డీలర్లు, పరపతి సంఘాల ద్వారా రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ నెల 2న 60 టన్నులు యూరియా వస్తుందని తెలిపారు. సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025

నూతన సంవత్సరం వెలుగులు నింపాలి

మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



బాపట్ల: నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. 2024 సంవత్సరం జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ 2025లో మంచి భవిష్యత్తు ఇవ్వాలన్నారు. అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధి జరగాలని సూచించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

వేమూరు ప్రజలకు అశోక్‌బాబు శుభాకాంక్షలు



భట్టిప్రోలు: ఈ నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలను పంచుకుంటూ, సరికొత్త ఉత్తేజం సొంతం చేసుకోవాలని వేమూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆకాంక్షించారు. నియోజక వర్గంలోని ప్రజలందరికీ మంగళవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని అశోక్‌బాబు కోరారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన ఈవూరి



రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని రేపల్లె నియోజకవర్గ ఆ పార్టీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు స్వీట్లు పంపిణీ



రేపల్లె రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పేటేరు గ్రామ సర్పంచ్ కనవర్తి వసుమతి పారిశుద్ధ్య కార్మికులకు అందించిన స్వీట్స్‌ను పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు.

నేడు అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



భట్టిప్రోలు: అయ్యప్పస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భట్టిప్రోలు రైల్వే గేట్ సమీపంలోని అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు అక్కల హరి గురుస్వామి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై మాలధారుల శరణు ఘోషతో గ్రామోత్సవం కావించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురుపీఠం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రక్తదానం ప్రాణాదానంతో సమానం



కర్లపాలెం: రక్తదానం చేయటం ప్రాణ దానంతో సమానమని కర్లపాలెం యూనియన్ బ్యాంక్ మేనేజర్ కె.మానస అన్నారు. మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆవరణలో బ్యాంక్, రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బ్యాంక్ మేనేజర్ మానస ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతలు ఇచ్చే రక్తం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణం పోసేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. తమ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో తమ సిబ్బందితో పాటు 50మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ కర్లపాలెం చైర్మన్ ఇనకొల్లు పోలీస్‌రావు, యూనియన్ బ్యాంక్ పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి భాస్కర్‌రావు, బ్యాంకు సిబ్బంది, రెడ్‌క్రాస్ స్వచ్ఛందసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీగా బిట్రగుంట



కొల్లూరు : వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో కొల్లూరుకు చెందిన బిట్రగుంట సత్యనారాయణకు చోటు లభించంది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నూతనంగా నియమించిన కమిటీలో బిట్రగుంటను జిల్లా జనరల్ సెక్రటరీగా నియమిస్తూ..మంగళవారం ఉత్తర్వులు వెలువడినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. సత్యనారాయణ మాట్లాడుతూ.. తనను జిల్లా పదవికి సిఫార్సు చేసిన వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు, జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జునకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీ పదవి అప్పగించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ఖాజీపాలెం(కర్లపాలెం): విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై శ్రద్ధ చూపగలరని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు అన్నారు. పిట్టలవానిపాలెంమండలంలోని ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని చక్కగా చదువుకుని ప్రయోజకులవ్వాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం పౌష్టికాహారంతో పాటు పరిశుభ్రమైన తాగునీటిని అందజేస్తున్నామని తెలిపారు.

రెవెన్యూ సభలను వినియోగించుకోవాలి



పెదగొల్లపాలెం(కర్లపాలెం): రెవెన్యూ గ్రామ సభలను వినియోగించుకోవాలని తహసీల్దార్ సుందరమ్మ పేర్కొన్నారు. పెదగొల్లపాలెం గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూముల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామ సభలలో అర్జీలు ఇవ్వాలని కోరారు. గ్రామ సభలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఆర్ఐ రాజేంద్ర, రైతులు పాల్గొన్నారు.

పోటుమెరకలో రెవెన్యూ సదస్సు

రేపల్లె రూరల్: పోటుమెరక గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు పాల్గొని ప్రజల నుంచి 14 అర్జీలు స్వీకరించారు. ఆర్ఐ రాంబాబు, ఏఎస్‌డబ్ల్యూవో ఎ.సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ కె.అనిత, ఎంఈవో రత్నశేఖర్ పాల్గొన్నారు.

నగర సంకీర్తనకు అపూర్వ ఆదరణ

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం వేణుగోపాల స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మేలు కొలుపు, నగర సంకీర్తన, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు ధనుర్మాస విశిష్టతను తెలియజేశారు.

30 మంది రక్తదానం

రేపల్లె రూరల్: కడప పెద దర్గా 10వ పీఠాధిపతి హజరత్ ఖాజా సయ్యద్ షా అమీనుల్లా మొహమ్మద్ మహమ్మదుల్ హుస్సేని చిస్టివుల్ ఖాద్రీ జన్మదినం సందర్భంగా ఆయన శిష్య బృందం 30 మంది ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య ప్రారంభించారు. రక్తదానం చేసిన వారిని అభినందించారు.